www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు


సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 13 | 02-01-2023 | పుటలు : 4

## నన్నయ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వీసీ

**01.01.23 (మీడియాసెల్)**

ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యా కేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాలెండర్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల సాధించిన అభివృద్ధి చిత్రాలతో నన్నయ విశ్వవిద్యాలయ క్యాలెండర్ ను రూపొందించామన్నారు. 2022 వ సంవత్సరంలో విశ్వవిద్యాలయం తొలిసారిగా నాక్ గుర్తింపును సాధించిందని తెలియజేశారు. విశ్వవిద్యాలయాని నాక్ గుర్తింపు చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. విశ్వవిద్యాలయాన్ని విద్యాపరంగా, పరిశోధనాపరంగా ఎంతో



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

అభివృద్ధిలోనికి తీసుకోవచ్చామని చెప్పారు. 2023 వ సంవత్సరంలో కూడా విశ్వవిద్యాలయం మరింత ప్రగతిని సాధించాలని, దానికి తగిన పరిస్థితులను సిద్ధం చేశామని తెలియజేశారు. తరువాత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లలోని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది వీసీ జగన్నాథరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కటింగ్‌లు, పుష్పగుచ్చాలు, పూలదండలు, జ్ఞాపికలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, అధికారులు, ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నన్నయలో 3న పీజీ స్పాట్ అడ్మిషన్స్

**29.12.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎం.ఏ, ఎం.కామ్, ఎం.పి.ఈడీ, ఎమ్మెస్సీ కోర్సులకు జనవరి 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీలో గురువారం స్పాట్ అడ్మిషన్స్ కు సంబంధించి ప్రకటనను వీసీ విడుదల చేసి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో ఎం.ఏ, ఎం.కామ్, ఎం.పి.ఈడీ మరియు ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 3వ తేదీన రాజమహేంద్రవరం యూనివర్సిటీ క్యాంపస్ కన్వెన్షన్ సెంటర్ లో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతుందన్నారు. ఏపిపీజీసెట్ - 2022 ర్యాంకర్లు స్పాట్ అడ్మిషన్స్ కు అర్హులని తెలిపారు. రెగ్యూలర్ సీట్లుతో పాటు సెల్ఫ్ సపోర్టు సీట్లును కూడా స్పాట్ అడ్మిషన్ లో భర్తీ చేస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్టులు, ఫీజులతో హాజరై డైరెక్టరెట్ ఆఫ్ అడ్మిషన్స్ ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 0883-2566011 / 7093008477 లేదా యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

## అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో నన్నయ ఎంవోయు

**29.12.22 (మీడియాసెల్)**

అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో జరిగిన "సెమినార్ ఆన్ కెరీర్ ఆపర్చునిటీస్ ఫర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్" కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, శ్రీకృష్ణదేవరాయ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య కె.నాగభూషణ్ రాజు లు ఎంవోయు పై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ఎంవోయు వివరాలను తెలియజేసారు. అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ భారతదేశంలోని ఎన్.ఐ.టి.ఐ ఆయోగ్ ద్వారా గుర్తించబడిన ప్రాంతంలోని ప్రధాన ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఒకటిగా ఉందని అన్నారు. వివిధ రంగాలలో వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో నిమగ్నమై ఉందని అన్నారు. ఈ ఎంవోయు ద్వారా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ, నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ల విద్యార్థులకు, అధ్యాపకులకు, సంస్థకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. స్టాట్ అప్ ఆలోచనలను బిజినెస్ ఐడియాలుగా మలుచుకోవడానికి తగిన అవకాశాలను కల్పిస్తారు. శ్రీ కృష్ణదేవరాయ



ఎంవోయు పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

యూనివర్శిటీ, నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలను వెలికితీయడానికి ప్రోత్సహిస్తారు. భవిష్యత్ లో నన్నయ విశ్వవిద్యాలయంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసుకోవడానికి సహకరిస్తుంది. వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి దాని ప్రయోగశాలలు, వర్క్‌షాప్ మరియు నైపుణ్యాన్ని విస్తరించడానికి సహాయపడుతుందన్నారు. శ్రీకృష్ణదేవరాయ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య కె.నాగభూషణ్ రాజు ఇంజనీరింగ్ విద్యార్థులకు భవిష్యత్ అవకాశాలను వివరించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటూ చదివే విధానాలు, లీడర్ షిప్ క్వాలటీలను పెంపొందించుకొనే సూచనలను అందజేసారు. వ్యవస్థాపక మార్గదర్శకాలు, అవకాశాలను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలియజేసారు. సెమినార్ కన్వీనర్ డా.వి.పెర్సిస్ ఇంజనీరింగ్ విద్యార్థుల్లోని వినూత్న ఆలోచనలు ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సహకారంతో విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులకు చక్కని కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కోకన్వీనర్స్ డా.డి.అప్పలరాజు, డా.జి.కీర్తిమరిట, జె.హనుమంతు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# కాలం - కర్తవ్యం

" ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రపంచాన్ని వెలిగించాను. ఇప్పుడు అస్తమిస్తున్నాను. నా బాధ్యత ఎవరు తీసుకుంటారు " అడిగాడు సూర్యుడు." నేను తీసుకుంటాను స్వామి " అంది చిన్న దీపం! ఇది గురుదేవులు రవీంద్రులు మనకిచ్చిన సందేశం.

చీకటిని తిడుతూ కూర్చునే కంటే చిన్న దీపాన్ని వెలిగించమని ప్రబోధం. సూర్యుడు,భూమి తమ కర్తవ్యాన్ని తాము నిరంతరాయంగా నిర్వహిస్తున్నాయి. అంతెందుకు విశ్వంలో ప్రతీది అంతే. సృష్టిలో కంటికి కనిపించని కాలం నిశ్శబ్దంగా సాగిపోతూ తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. సూర్యాస్తమయాలు ఒక్కటే మన కంటికి కనిపించేవి.

" కాలానికి ఒక రూపం లేదు, దానికి పాపం లేదు, కాలం అద్దం లాంటిది. అంధ యుగమైనా, స్వర్ణ యుగమైనా అది మన ప్రతిబింబం! " అన్నారు తిలక్ అమృతం కురిసిన రాత్రి కవితా సంకలనంలో.

కాలం కంటే చిత్రమైందేముంది. కాలాన్ని విశ్లేషించని తాత్వికుడు, స్మరించని కవి ఈ లోకంలో లేరు. కాలచక్రం తిరిగిపోతూ ఉంటుంది. దాని కింద ఎన్ని రాజ్యాలు, రాజులు, చక్రవర్తులు, ప్రభుత్వాలు, అధికారాలు,అహంకారాలు నలిగిపోయాయి.' రాజ్యాన్ని, ధనాన్ని వాళ్ళు తమ కూడా తీసుకుని వెళ్లారా? 'అని భాగవతంలో బమ్మెర పోతన గారు ప్రశ్నించారు. గుప్పిటలో ఇసుకలాగ జారిపోవుకాలం... అన్నారో సినీ కవి. గణాంకాలతో నెగ్గు తేల్చి కనిపించని కాలాన్ని సాపేక్ష సిద్ధాంతం ద్వారా శాస్త్రబద్ధం చేశారు కదా ఐన్స్టీన్ మహానుభావులు.

పోగు చేస్తే పైసలు రూపాయలుగా, వేలు లక్షలుగా అవుతాయని అంటారు మన పెద్దలు. కాలం కూడా అంతే!! సెకండ్లని, నిమిషాలని ఆదా చేస్తే కొన్ని గంటలు మన ఆధీనంలో ఉంటాయి. అప్పుడు సమయం సద్వినియోగమౌతుంది.

సమయాన్ని విద్యగా, శ్రమగా, ధనంగా, కర్తవ్యం(డ్యూటీ)గా తర్జుమా చేసుకోవటమొక్కటే మన చేతుల్లో ఉంది. కాలాన్ని వెనక్కి తీసుకొని రావటం, సృష్టించి ఇవ్వటం ఎవరి చేతుల్లోనూ లేదు కదా! వెళ్ళిపోయిన క్షణం తిరిగి రాదని అందరికీ తెలుసు. తేదీలు,తిథులు, నెలలు, సంవత్సరాలు మారిపోతుంటాయి. కొత్త సంవత్సరం వచ్చి వెళ్లినట్లుగానే ఉగాదులు కూడా వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి.విలువైన కాలాన్ని మనపని మనం చేయటానికి, మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించటానికి సద్వినియోగం చేసుకుంటే జీవితాన్ని మనం సఫలం చేసుకున్నట్లే!

# అనలాగ్ ఆస్ట్రోనాట్ జాహ్నవి విద్యార్థులకు స్ఫూర్తి




**28.12.22 (మీడియాసెల్)**

నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (NASA) యొక్క ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్ (IAPS)లో పాల్గొన్న మొదటి భారతీయురాలు గోదావరివాసి కావడం మనకు గర్వకారణమని, జాహ్నవి దంగేటి ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రశంసించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం డీన్ స్టూడెంట్ ఆఫైర్స్ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఇంట్రాక్షన్ అండ్ మోటివేషన్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, అనలాగ్ ఆస్ట్రోనాట్ దంగేటి జాహ్నవి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన NASA యొక్క ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాంకు ప్రపంచ వ్యాప్తంగా చాలా కొద్దమంది మాత్రమే ఎంపికవుతారని, అటువంటి ప్రోగ్రామ్ కు మొదటి సారిగా భారతదేశం నుండి తెలుగుతేజం, గోదావరివాసి దంగేటి జాహ్నవి ఎంపికకావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. పాలకొల్లులోని నిరుపేద కుటుంబంలో జన్మించిన జాహ్నవి లక్ష్య సాధనకు ఎంతో కృషి చేస్తుందని యువత ఇటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. జాహ్నవి సంకల్పశుద్ధి కలిగిన చొరవ ఆమెకు అవసరమైన లక్ష్యాలను సాధించేలా చేసిందన్నారు. వివిధ దశలను దాటి వ్యోమగామిగా శిక్షణ కూడా పొందిందన్నారు. ఇటీవల యూరప్ లోని ఐస్ లాండ్ దేశంలో నిర్వహించిన అంతరిక్ష వ్యోమగాముల శిక్షణ శిబిరంలో భారతదేశం తరుపున జాహ్నవి ప్రాతినిధ్యం వహించారని, ఈ శిబిరానికి ఎంపికైన తొలి భారతీయురాలిగా ఆమె ఘనత సాధించారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జాహ్నవిని ప్రోత్సహిస్తుందని, ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని కలిసిన జాహ్నవికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున ఆర్థిక సహకారం అందజేసారని చెప్పారు. స్పేస్ లోకి వెళ్ళడానికి కఠినమైన శిక్షణ అవసరమని, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా జాహ్నవి ముందుకు సాగిందని, ఆమెను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనలాగ్ ఆస్ట్రోనాట్ దంగేటి జాహ్నవి మాట్లాడుతూ బామ్మచెప్పిన చందమామ కథలనే లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగానని అన్నారు. స్పేస్ శిక్షణకు అసరమైనంత పరిస్థితులు స్థానికంగా లేకపోయినా దానిపై ఉన్న మక్కువతో ప్రయత్నాలు చేసి ఈ స్థితికి చేరుకున్నానని చెప్పారు. ఇష్టంతో కష్టమైన అంతరిక్ష వ్యోమగామిగా చంద్రునిపై అడుగుమోపాలని ధ్యేయంగా శిక్షణ పొందానని తెలిపారు. యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని దానికి తగినట్టుగా కృషి చేయాలని సూచించారు. సీఎం జగన్మోహనరెడ్డి, వీసీ జగన్నాథరావుల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జాహ్నవిని అభినందించి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎన్.ఉదయభాస్కర్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎ.మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డా. అరిపిరాల నారాయణరావు, మహాలక్ష్మి ప్రతిభా ప్రోత్సాహకం

## వీసీకి లక్ష రూపాయల చెక్కు అందజేత

**28.12.22 (మీడియాసెల్)**

సాహిత్యవేత్త డా.అరిపిరాల నారాయణరావు, శ్రీమతి మహాలక్ష్మి ప్రతిభా ప్రోత్సాహకం పేరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతిని అందించే విధంగా లక్ష రూపాయల చెక్కును వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు అందజేసారు. బుధవారం విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయంలో డా.అరిపిరాల నారాయణరావు కుమారులు అరిపిరాల వేంకటరవి,కుమార్తె వసంతాడ శేషశాయికుమారి లు వీసీ జగన్నాథరావును కలిసి లక్ష రూపాయల చెక్కును అందజేసారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ సాహిత్యవేత్త డా.అరిపిరాల నారాయణరావు, మహాలక్ష్మి ప్రతిభా ప్రోత్సాహకం పేరుతో లక్ష రూపాయల ఆర్థిక సహకారాన్ని వారి పిల్లలు విశ్వవిద్యాలయానికి సమర్పించారని అన్నారు. తెలుగుశాఖలో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి స్నాతకోత్సవంలో లక్ష రూపాయల ద్వారా వచ్చిన వడ్డీని ప్రోత్సాహకంగా అందిస్తామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్న అరిపిరాల కుటుంబాన్ని వీసీ జగన్నాథరావు అభినందించారు. గోదావరి జిల్లాల విద్యాకేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సహృదయులైన దాతలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, తెలుగుశాఖ కోఆర్డినేటర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, డా.తలారివాసు పాల్గొన్నారు.



వీసీ జగన్నాథరావుకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

# ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌తో నన్నయ ఎంవోయు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (IPE) మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఐపీఈ కు వెళ్లిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రాంగణంలోని చారిత్రక శిలలు సుమారు 2500 మిలియన్ సంవత్సరాల కంటే పురాతనమైనవని తెలియజేశారు. భూ విజ్ఞాన శాస్త్ర సంపదగా ఇటువంటి శిలలను కాపాడుకోవాలని అన్నారు. ఇవి వైట్ గ్రానైట్ జాతికి చెందిన శిలలు గా గుర్తించారు. ఐపిఈ సంస్థ ఇటువంటి పురాతన శిలలపై నిర్మించబడడం విశేషమన్నారు. భూవిజ్ఞాన శాస్త్రజ్ఞునిగా ఆచార్య జగన్నాథరావు నిపుణతను ఐపీఈ సంస్థ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ ఎంవోయు ప్రకారం విద్యార్థులు, అధ్యాపకులు మార్పిడి ద్వారా పరిశోధన మరియు అభివృద్ధిలో పరస్పరం సహకరించుకోవడం. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ మరియు ప్లేస్‌మెంట్ అవకాశాలను సులభతరం చేయడానికి రెండవ పక్షం అంగీకరించారు. మొదటి పక్షం పి.హెచ్.డి పొడిగించడానికి అంగీకరం, అదనపు మ్యూరల్ రీసెర్చ్ కేటగిరీ కింద సెకండ్ పార్టీ ఫ్యాకల్టీ సభ్యులు మరియు రీసెర్చ్ స్కాలర్‌లకు అడ్మిషన్లు వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ విషయంలో పరస్పరం లాజిస్టికల్ మద్దతును అందించడానికి రెండు పార్టీలు పరస్పరం అంగీకరం తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్. టేకి, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస్ మూర్తి, డైరెక్టర్ ఐపీఈ హైదరాబాద్, అధ్యాపకులు ప్రొఫెసర్ వి శ్రీకాంత్, ప్రొఫెసర్ కె త్రివిక్రమ్, ప్రొఫెసర్ ఎ. విద్యాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మంచిమాట

నిరుత్సాహపరచే ఆలోచనలు వస్తే వాటిని బయటకు పారద్రోలండి. మీ మనస్సును ఎల్లప్పుడూ ఉన్నత ఆశయాలతో నింపండి.

Always keep your mind joyful ; if melancholy thoughts come , kick them out.

- స్వామి వివేకానంద



# రాజరాజేశ్వరిదేవిని అభినందించిన మంత్రి వేణు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో నన్నయ యూనివర్సిటీలో పార్ట్ టైం డిప్లమా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సు ను ప్రారంభించామని బీసీ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణ కు డాన్స్ కోర్స్ కోఆర్డినేటర్ డా.కె.శ్రీ రాజరాజేశ్వరి దేవి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను అభినందిస్తూ సంస్కృతి రాజధానియైన రాజమహేంద్రవరంలో డాన్స్ కోర్సును విజయవంతంగా నిర్వహించాలని తెలియజేశారు.



# సామాన్యులలో అసామాన్యుడు గాంధీ

## పుస్తకం




మహాత్మునిగా,స్వాతంత్ర సమరయోధునిగా మనకు తెలిసిన గాంధీ వ్యక్తిత్వం కొంచమే. అయితే గాంధీ నిరంతర శ్రమజీవి. ప్రతి మనిషి రోజు కొంతైనా శ్రమ చేయాలన్నది గాంధీజీ సిద్ధాంతం. గాంధీ గురించి మనకి తెలియని ఎన్నో విషయాలను అను బందోపాధ్యాయ రాసిన, నండూరి వెంకట సుబ్బారావు తెలుగులో అనువదించిన"బహురూపి గాంధీ"పుస్తకం చదివితే మనకే అర్ధమవుతుంది. భారత జాతిపితగా పేరుగాంచిన గాంధీ నిత్యం చరఖాపై నూలు వడకడం,మగ్గంపై నేయడం,వంట చేయడం,కుట్టుపని, మొక్కలపెంపకం,బరువైన సరుకులు దించడం వంటి పనులను సొంతంగా చేసుకునేవారు. దక్షిణాఫ్రికాలోని ఆయన స్నేహితులు గాంధీజీని'కర్మవీరుడు' అనేవారు.

సబర్మతి ఆశ్రమంలో గుడిసె నిర్మాణం చేపట్టినప్పుడు అందరికంటే ముందు ఆయనే నడిచారు. చిన్న,పెద్ద మేకులు ఉన్న పెద్ద జేబులతో నిండిన చొక్కా వేసుకొని సుత్తి,రంపం పట్టుకొని వారం రోజుల్లోనే గుడిసె నిర్మాణం పూర్తి చేశారు. సుదీర్ఘమైన,వేగవంతమైన నడక ఆయన దృష్టిలో తిరుగులేని వ్యాయామం. అందుకే ప్రతి రోజు కొన్ని మైళ్ళు నడిచి వెళ్లేంత ఆరోగ్యంగా ఉండేవారు గాంధీ. తన మరుగుదొడ్లను తానే శుభ్రపరచుకొని,తన బట్టలు తానే ఉతుక్కునేవారు. చెప్పులు కుట్టే పనిని దక్షిణాఫ్రికాలోని కాలన్ బాక్ అనే జర్మన్ స్నేహితుని దగ్గర నేర్చుకున్నాడు.

తన ఆశ్రమంలో తోటివాళ్లతో కూరగాయలను కొయ్యకు ముందు ఎందుకు కడగాలో వివరించి,వంటలు ఇరవై నిమిషాలలో సిద్ధపరిచేవారు. ఆరోగ్యంగా ఉండేందుకు తినాలి గాని నాలుకను సంతృప్తిపరచడానికి తినకూడదని గాంధీజీ అభిప్రాయం. జబ్బులను తగ్గించేందుకు నీరు,మట్టి,తాజాగాలి, సూర్యరశ్మి సాయంతో చికిత్సచేసే విధానాన్ని కనిపెట్టారు. ముందు తనకు తాను ప్రయోగం చేసుకుని ఇతరుల మీద ప్రయోగించేవారు. ఉపవాసం చేయడం, ఆహారంలో మార్పులు,మూలికల వాడకం మీద దృష్టిపెట్టేవారు. తన ఆశ్రమంలో తోటివారికి చికిత్స చేసేవారు. చికిత్స పద్ధతుల కన్నా నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టి పెట్టేవారు. రోగాలు అంటుకుంటాయన్న భయం ఆయనకు ఎప్పుడూ ఉండేది కాదంట. తన ఆశ్రమానికి సందర్శకులు వచ్చినప్పుడు చరఖా మీద పనిచేస్తూ తాను,తన భార్య బట్టలు ఎలా సొంతంగా తయారుచేసుకుంటున్నారో వివరించేవారు. గాంధీ చాలా పొదుపు మనిషి. చవకగా,నాణ్యంగా ఉండే వస్తువులు వాడుతూ ఖాదీవస్త్రాలు,ముతక చెప్పులు ధరించేవారని ఈపుస్తకం ద్వారా తెలుస్తుంది. అంతేకాకుండా ఎప్పుడూ విందుభోజనం చేసేవారు కాదు. కేవలం ఉడికించిన ఆకుకూరలు, రెండు కాల్చినరొట్టెలు,బెల్లం,తేనె,పళ్ళు మాత్రమే ఆయన ఆహారం. గాంధీ సమయపాలనలో కచ్చితంగా ఉండేవారు. ఏ పనికి ఆయన ఆలస్యంగా వెళ్లేవారు కాదు. అలాగని కంగారుపడి ఏపని చేసేవారు కాదు. అలా ఇంట్లో ఉన్నప్పుడు,బయట కార్యక్రమాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నప్పుడు, సమావేశాల్లో ఉన్నప్పుడు,సామాన్య ప్రజలతో ఉన్నప్పుడు అత్యంత సాధారణ వ్యక్తిలా ఎలా మెలిగేవారో ఈ "బహురూపి గాంధీ" పుస్తకం చదివితే అందరికీ అర్థం అవుతుంది.

ఈపుస్తకం చదివిన వారందరూ వీలైనంతవరకు ఎవరిమీద ఎవరు ఆధారపడకుండా మన పనులు మనమే చేసుకోవాలని,మన జీవితాన్ని మనకు మనమే మలుచుకోవాలని తెలుసుకుంటారు. కావున అందరూ ఈ పుస్తకం చదవాలని కోరుకుంటున్నాను.




- బి.సుశాంత్ కుమార్,
ఆదికవి నన్నయ యూనివర్సిటీ

# నన్నయలో డిప్లమా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సు


డాన్స్ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

**30.12.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పార్ట్ టైమ్ డిప్లామా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సును ప్రారంభిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం కూచిపూడి డాన్స్ కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ లో ప్రదర్శక కళల విభాగం, నన్నయభారతి, నన్నయ అధ్యయన కేంద్రాల ద్వారా పార్ట్ టైమ్ డిప్లామా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సును ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఒక సంవత్సరం కాలపరిమితితో నడుపబడే ఈ పార్ట్ టైమ్ డిప్లమాకోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు మాత్రమే అర్హులన్నారు. కోర్సు కోఅర్డినేటర్ గా డా.కె.శ్రీరాజరాజేశ్వరిదేవి వ్యవహరిస్తారని తెలిపారు. సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో కళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ విశ్వవిద్యాలయం పలు కార్యక్రమాలను చేపట్టిందని గుర్తు చేసారు. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయం నడుపుతున్న పార్ట్ టైమ్ డిప్లామా ఇన్ కూచిపూడి డాన్స్ కోర్సును ప్రాంగణ విద్యార్థులు, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయం సైకాలజీ పూర్వవిద్యార్థి తాతినేని మెహర్ ప్రసాద్ బహుకరించిన వైర్ లెస్ సౌండ్ సిస్టమ్ ను వీసీ ప్రారంభించి ఆయనను అభినందించారు. నన్నయ విశ్వవిద్యాలయంపై ఉన్న అమితమైన ప్రేమతో గతంలో మెహర్ ప్రసాద్ బీరువాలు, వాటర్ డిస్పెన్సర్ లు బహూకరించారని వారిని ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధికి దాతలు మరింత సహకరించాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వీసీ మొక్కా జగన్నాథరావు కృషి అభినందనీయమని మెహర్ ప్రసాద్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డాన్స్ కోర్సు కోఆర్డినేటర్ డా.కె.రాజరాజేశ్వరిదేవి, నన్నయ భారతి కోఆర్డినేటర్ డా.తలారివాసు, తాతినేని మెహర్ ప్రసాద్, డా.కె. నూకరత్నం, డా.ఎన్.ఉదయభాస్కర్, కుడిపూడి పార్థసారధి,ఆర్టిస్ట్ ప్రసాద్ పాల్గొన్నారు.

# నన్నయ టేబుల్ టెన్నిస్ మెన్ టీమ్ సెలక్షన్స్


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పురుషుల టీమ్ సెలక్షన్స్ ను స్పోర్ట్స్ బోర్డ్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు కోఆర్డినేటర్‌గా వ్యవహరించి టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంతో పాటు అనుబంధ కళాశాలల నుండి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. దీనిలో ప్రతిభ కనపరచిన ఐదుగురును యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేసి సౌత్ జోన్ పోటీలకు పంపనున్నారు. ఈ పోటీలను పి.వేణుగోపాలరావు, పి.వి.ఎస్.ఎస్. సత్యానారాయణ పర్యవేక్షించి ప్రతిభ కనపరచిన క్రీడాకారులను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గణితశాస్త్ర పోటీలలో విజేతలకు బహుమతులు


విద్యార్థికి జ్ఞాపికను అందిస్తున్న ప్రిన్సిపాల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్టమెంట్ ఆఫ్ మేథ్మెటిక్స్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, కోర్సు కోఆర్డినేటర్ డా.కె.రేవతి మరియు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వేధిక్ మేథ్మెటిక్స్ పై అతిథి ఉపన్యాసాన్ని ప్రధాన ఉపాధ్యాయుడు పి.కృష్ణమోహన్ అందించారు. కంట్రిబ్యూషన్స్ ఆఫ్ రామానుజన్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తో ఉపన్యసించారు. తరువాత విద్యార్థులు బుర్రకథ, హరికథ, సోది, మోనో యాక్షన్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో గణితశాస్త్ర ప్రతిభను, రామానుజన్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో డా.మల్లిప్రియ, కె.వరకుమార్, జి.అశోక్, కరుణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛభారత్ పచ్చదనం సేవ

జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ బ్లాక్ ఆవరణలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 1,2 వాలంటీర్లచే స్వచ్ఛభారత్ పచ్చదనం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ప్లాస్టిక్ వ్యర్ధాలను, తుప్పలను తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచారు. పర్యావరణహితమైన కార్యక్రమాలు మరిన్ని చేయాలని ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. వి. పద్మప్రియ పాల్గొన్నారు.

# ఉమెన్ సెల్ కార్యాలయం ప్రారంభించిన వీసీ

**31.12.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఎంపవర్మెంట్ డెవలప్మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ కార్యాలయాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. యూనివర్సిటీ లోని డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉమెన్ సెల్ కార్యాలయాన్ని వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉందన్నారు. ఎక్కువ మంది అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, విశ్వవిద్యాలయ అధికారులుగా, ఉద్యోగులుగా పురుషులతో సమానంగా మహిళలు పని చేస్తున్నారని చెప్పారు. మహిళల అభివృద్ధి, సమస్యల పరిష్కారాలకు ఉమెన్ సెల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ గా డా.కె.నూకరత్నం వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉమెన్ సెల్ కు చక్కని గదిని ఏర్పాటు చేసిన వీసీ జగన్నాథరావును కోఆర్డినేటర్లు సన్మానించి అభినందించారు.




**రెండు ఆర్ఓ ప్లాంట్‌లు ప్రారంభం**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం మరియు ఇంజనీరింగ్ నూతన భవనానికి రెండు ఆర్.ఓ ప్లాంట్ లను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. లైబ్రరీకి వచ్చే విద్యార్థులకు చక్కని త్రాగునీటిని అందించేందుకు మరియు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని సివిల్ మెకానికల్ భవనంలోని విద్యార్థుల త్రాగునీటి అవసరాల నిమిత్తం రెండు ఆర్.ఓ ప్లాంట్ లను ఏర్పాటు చేసామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ ఆచార్య. కె.రమణేశ్వరి, ఇంజనీరింగ్ డా.కె.నూకరత్నం, డా.పి.ఉమమహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in